సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



న్యాక్ బృందం సందర్శన
తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను మంగళవారం న్యాక్ బృందం సందర్శించింది. కళాశాలలో వసతులు, బోధనా పద్ధతులను పరిశీలించారు.



నిబంధనలు పాటించాలి
సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలినా ఆల్ఫ్రెడ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. నిబంధనలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

గరిష్టం/కనిష్టం
28.0/16.0

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది.
ఉదయం మంచు కురుస్తుంది.
చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి రాధికా జైస్వాల్

వీర్నపల్లి(సిరిసిల్ల): విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని, హక్కుల పరిరక్షణకు ప్రయత్నించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సీనియర్ సివిల్ కార్యదర్శి రాధికా జైస్వాల్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో నడుచుకోవాలన్నారు. పోక్సో, రైట్ ఎడ్యుకేషన్ యాక్ట్‌లపై అవగాహన ఉండాలని, బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. న్యాయపరమైన విషయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి.పరశురాములు, ఎస్సై ఎల్లయ్య గౌడ్, ఎంఈవో తుమ్మ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల్లో తేడా వస్తే చర్యలు



సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి తదితరులు

ఇల్లంతకుంట(మానకొండూర్): ఉపాధి హామీ పనుల నిర్వహణలో తేడాలు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 14వ విడత ఉపాధి పనుల సోషల్ ఆడిట్ ప్రజా వేదికలో పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన పనులపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల నివేదికలు పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీడీవో శశికళ, సహాయక విజిలెన్స్ అధికారి రామారావు, క్వా లిటీ కంట్రోల్ అధికారి నవీన్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవాలి



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్లటౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు వెంటనే పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల జీతం చెల్లిస్తామని అధికారంలోకి వచ్చి ఏడాదిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిల్లలకు మెస్‌చార్జీలు పెంచాలని, నిత్యవసర సరుకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్, నరసవ్వ, రాజవ్వ, సరోజన, విజయ, రేణుక, రాజేశ్వరి, రోజా, సునీ త, మల్లవ్వ, ఎల్లవ్వ, సుజాత, జుబేదా జయిత్తు, అనిత, లక్ష్మి, సరోజన తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా వ్యవసాయ గణన



సమావేశంలో అధికారులు

సిరిసిల్ల: జిల్లాలో ఈనెల 31లోగా వ్యవసాయ గణన పూర్తిచేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, డెప్యూటీ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేయబడిన 50 గ్రామాల్లో మండల వ్యవసాయాధికారులు సెన్సెస్ చార్జి ఆఫీసర్లు ఉంటారని, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎన్యుమరేటర్లుగా, సూపర్‌వైజర్లుగా ఎంపీఎస్‌వోలు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ గణన ఫేజ్-3లో ఎంపిక చేయబడిన 21 గ్రామాల్లో సర్వే చేయాలన్నారు. సమగ్ర సమాచారాన్ని నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై ఆరా

- గత ప్రభుత్వ హయాంలో భూ కేటాయింపులపై విచారణ
- 300 ఎకరాల అక్రమ పట్టాల గుర్తింపు
- ప్రభుత్వానికి నివేదిక.. చర్యలకు సిఫార్సులు
- బీఆర్‌ఎస్ నేతలకు బిగుస్తున్న ఉచ్చు

జిల్లాలో భూముల వివరాలు

గ్రామాలు	260
మండలాలు	13
రెవెన్యూ గ్రామాలు	171
సర్వే నంబర్లు	91,416
భూములు	4,68,532 ఎకరాలు

జిల్లాలో కేటాయించిన అసైన్డ్ భూములు: గోప్యంగా ఉంచారు



పెద్దూరు శివారులోని అసైన్డ్ భూములు

సిరిసిల్ల: పేదల పేరిట పెద్దలకు పట్టాలిచ్చిన అసైన్డ్ భూములపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆరా తీస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నేతలకు ప్రభుత్వ భూములను పట్టా లుగా కట్టబెట్టిన తీరుపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నేతృత్వంలో ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 300 ఎకరాల అసైన్డ్ భూములు అక్రమంగా అధికార పార్టీ నేతల చేతుల్లోకి వెళ్లినట్లు యంత్రాంగం గుర్తించింది. ఈ మేరకు అర్హత లేకున్నా.. పట్టాలు పొందిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలా..? పాత రెవెన్యూ చట్ట నిబంధనల మేరకు ఆ భూములను వెనక్కి తీసుకోవాలా..? ధరణి పోర్టల్ రద్దు అవుతున్న నేపథ్యంలో కొత్త రెవెన్యూ చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలా..? అనే అంశాలపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు సమాచారం.

భూకబ్జా కేసులో బీఆర్‌ఆర్ నేత జైలుకు..

సిరిసిల్ల పట్టణ శివారులోని సర్ధాపూర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ నేత బొల్లి రామ్మోహన్‌ను నవంబరు 30న పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ కేసులో ఇంకా కొంత మంది నిందితులుగా ఉన్నట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో అదర్స్‌గా పేర్కొన్నారు. ప్రభుత్వ భూకబ్జాకు సంబంధించి ఎన్‌వోసీ జారీ చేసిన తహసీల్దార్, రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌తో పాటు, అక్కడి భూమిని పొందిన ఇతరులపైనా కేసులు నమోదవుతాయని భావిస్తున్నారు. నిజానికి ప్రభుత్వ భూకబ్జా కేసుల్లో పట్టాలు పొందిన వ్యక్తికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి, ఆ భూమిని వెనక్కి తీసుకోవచ్చు. నోటీసు తీసుకోకుండా సదరు వ్యక్తి తిరగబడితే పోలీసు కేసు నమోదు చేయవచ్చు. కానీ అలాంటిది ఏమీ లేకుండానే నేరుగా పోలీసు కేసు నమోదు చేసి రామ్మోహన్‌ను జైలుకు పంపించారు. బీఆర్‌ఎస్ నేతలుగా ఉన్నందుకే తమపై కక్ష సాధింపుగా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని నాయకులు పేర్కొంటున్నారు.

అసైన్డ్ భూముల కేటాయింపులపై..

2014లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్లుగా సిరిసిల్ల, వేములవాడ ఎమ్మెల్యేలు కేటీఆర్, చెన్నమనేని రమేశ్‌బాబు సిఫార్సుల మేరకు ఎవరెవరికి ఏ ఊరిలో ప్రభుత్వ భూమిని కేటాయించారు..? పట్టా పొందిన వ్యక్తి ఇప్పుడు కబ్జాలో ఉన్నారా..? తదితర వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూములకు పట్టాలు పొందిన వ్యక్తి పేదవాడైతే, అర్హత ఉంటే వారిపై కేసులు ఉండవని, అధికారుల అండతో ప్రభుత్వ భూమిని చెర పట్టిన వారు చెరశాలకు వెళ్లాల్సిందేనని ప్రస్తుత అధికార పార్టీ నేత ఒకరు చెప్పడం కొసమెరుపు.



ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ భూముల్లో పంటల సాగు

దళిత మహిళలకు కేటాయింపులపై..

జిల్లాలో భూ కొనుగోలు పథకం(ఎల్‌పీఎస్)లో భూమి లేని పేద దళిత మహిళలకు 2014 నుంచి 2021 వరకు 165 మందికి 436.02 ఎకరాలు కేటాయించారు. వాస్తవానికి పట్టాలు పొందిన దళిత మహిళలు ఆ భూములను సాగు చేసుకుంటున్నారా..? వారు అర్హులేనా.. అనే అంశాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

నోరువిప్పని రెవెన్యూ అధికారులు

అసైన్డ్ భూములపై అధికారులు ఆరా తీయడంతో రెవెన్యూ అధికారులను 'సాక్షి' సంప్రదిస్తే నోరు విప్పడం లేదు. 'అంతా పెద్ద సారే చూసుకుంటున్నారు' అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల కేటాయింపుల వివరాలు అడిగితే తమను ఏమీ అడగొద్దని, ఏమీ తెలియదని అధికారులు దాటవేత ధోరణిని అనుసరించడం గమనార్హం. ఓ అధికారి అయితే.. ఏకంగా ఈ భూముల లొల్లి ఏమిటీ అని లీవులో వెళ్లినట్లు పేర్కొనడం విశేషం.

ఇప్పటికే గుర్తించినవి కొన్ని..

- సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు, సర్ధాపూర్, చిన్నబోనాల, పెద్దబోనాల శివారుల్లోని ప్రభుత్వ భూములకు కొందరు బీఆర్‌ఎస్ నేతలు పట్టాలు పొందినట్లు సమాచారం.
- పట్టణానికి చెందిన ఓ ముఖ్యనాయకుడి తమ్ముడి పేరిట రెండెకరాల భూమికి పట్టా పొంది, ఇటీవలే దాన్ని మళ్లీ రద్దు చేసుకున్నట్లు తెలిసింది.
- ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఓ మాజీ ఎంపీటీసీ ఏడెకరాలు, ఓ మాజీ జెడ్పీటీసీ ఐదెకరాలు పొందినట్లు గుర్తించారు.
- ముస్తాబాద్ మండలంలోనూ అనర్హులకు భూములు కేటాయించినట్లు గుర్తించారు.
- సిరిసిల్ల పట్టణానికి, తంగళ్లపల్లి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కొందరు తలా రెండుమూడెకరాలకు పట్టాలు తీసుకున్నట్లు గుర్తించారు. అప్పట్లోనే ఎకరానికి రూ.5 లక్షలు ఖర్చుల పేరిట బీఆర్‌ఎస్ నాయకుడు ఒకరు వసూలు చేసి, రెవెన్యూ ఉన్నతాధికారులకు సమర్పించి భారీ ఎత్తున ప్రభుత్వ భూమిని పట్టాలుగా పొందినట్లు సమాచారం. అప్పట్లో పట్టాలు పొందిన బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు రామ్మోహన్ అరెస్ట్‌తో ఆందోళనకు గురవుతున్నారు.

మంచి మార్కులు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(రామగుండం): ఇంటర్మీడియెట్ బోర్డు సూచించిన యాక్షన్‌ప్లాన్ ప్రకారం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి వై.శ్రీనివాస్ సూచించారు. ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమంతప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. సైన్స్ విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాసరవేణి పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



సమావేశంలో శ్రీనివాస్‌రావు తదితరులు

వేములవాడఅర్బన్: పట్టణంలోని జిల్లా ఉద్యమ కళాకారుల ప్రధాన కార్యాలయంలో మంగళవారం కళాకారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ఈ నెల 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ ఉద్యమ కళాకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలన్నారు. అన్ని జిల్లాల నుంచి కళాకారులు హాజరుకావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వారాల దేవయ్య, కళాతపస్వి యెల్లా పోశెట్టి, జ్యోతిరెడ్డి, జానకిరెడ్డి, కొండ స్వామి, లక్ష్మీరాజం, శంకరయ్య ఉన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళ



క్రీడాకారులతో చైర్‌పర్సన్ కళ తదితరులు

సిరిసిల్లటౌన్: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో జీవితంలో ముందుకు సాగాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ లెవెల్ సీఎం కప్-2024 క్రీడల పోటీలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు గెలుపోటములను సాధారణంగా భావించి గెలిచినవారు రాబోయే కాలంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని, భవిష్యత్తులో మన ప్రాంతానికి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, ఏఎంసీ చైర్మన్ వెలుముల స్వరూపరెడ్డి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు దేవత ప్రభాకర్, తిరుపతి, జగన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జంక్షన్ డిజైన్ మార్చాలి



పనులు పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

వేములవాడ: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ డిజైన్ మార్పు చేసి అహ్లాదకరమైన జంక్షన్ ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ విగ్రహ జేఏసీ, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రారంభమైన జంక్షన్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేడ్కర్ చౌరస్తా సుందరీకరణ డిజైన్ కోసం ప్రజాసంఘాల అభిప్రాయాన్ని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సేకరించాలని విజ్ఞప్తి చేశారు. గార్డెన్ సెంటర్ పాయింట్‌లో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మిశెట్టి విజయ్, సిరిగిరి రామచందు, గోలి మహేశ్, నాయకులు దుమ్మ ఆనంద్, సంటి అంజిబాబు, గుండా థామస్, మూలే కిషోర్, బొడ్డు రాములు, జక్కుల యాదగిరి, జింక శ్రీధర్, సిరిగిరి శ్రీకాంత్, పిట్టల సతీశ్, లింగంపల్లి కిరణ్, గుడిసె మనోజ్‌కుమార్, వంకాయల మహేశ్వర్, తాళ్లపల్లి నాగరాజ్, బొజ్జ చంద్రమోహన్, చర్ల రమేశ్, చర్ల బాలు, వేణుగోపాల్, గుడిసె అరుణ్, అమర్, జింక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

సిరిసిల్లటౌన్: తమ ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు విధులకు హాజరుకాకుండా మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఈసందర్భంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు కల్పించాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పదవి విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ రూ.25లక్షలు ఇవ్వాలన్నారు. సంఘం ప్రతినిధులు ఇప్పపూ ల దేవయ్య, కత్తి జయలక్ష్మి, రాజు, రాజేందర్, భవాని, నీరజ, సలీం, నరేందర్, శ్రీనివాస్, పద్మ, జ్యోతి పాల్గొన్నారు.



అరెస్టు అప్రజాస్వామికం

సిరిసిల్ల ఠాణాలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

సిరిసిల్లటౌన్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకుండా అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. మంగళవారం చలో హైదరాబాద్ వెళ్తున్న ఆశాలను ప్రభుత్వం ఎక్కడికక్కడ అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు రూ.18వేలు వేతనం అందించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వలె కాంగ్రెస్ సర్కారు సైతం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. అరెస్టయిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, అన్నల్దాస్ గణేశ్, చంద్రకళ, లావణ్య, ఆశావర్కర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలపండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 12 లోపు తెలపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో అఖిల పక్ష నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 17న తుది పోలింగ్ కేంద్రాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు, 2,268 వార్డులు ఉన్నాయని, ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను గుర్తించి డ్రాఫ్ట్ జాబితా విడుదల చేశామన్నారు. ఈనెల 13న అభ్యంతరాలను ఎంపీడీవో పరిశీలించి తుది నివేదిక అందించాలని, 16న కలెక్టర్ ఆమోదంతో తుది నిర్ణయం తీసుకొని 17న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎంపీడీవోల ద్వారా తుది పోలింగ్ కేంద్రాల జాబితా వెల్లడిస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లు గుర్తించాలి

ప్రభుత్వ నిర్మాణాలు, స్థానిక, వాణిజ్య అవసరాలకు ఇసుక రీచ్‌లను గుర్తించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ మీటింగ్‌లో మాట్లాడారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లపై ఆరా తీశారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ ఇసుకకు రూ.100 ఉండగా, రూ.160 పెంచాలని కమిటీ ప్రతిపాదనలు చేశారు. నిబంధనల మేరకు ఇసుక రవాణాకు అనుమతించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతికుమార్, డీటీవో లక్ష్మణ్, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్‌రెడ్డి, సర్వే ఏడీ వినయ్‌కుమార్, భగీరథ ఈఈ జానకి పాల్గొన్నారు.

15లోగా ఇవ్వాలి

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఈనెల 15లోగా ఇవ్వాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. కలెక్టరేట్‌లో సీఎమ్మార్‌పై అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. జిల్లాలోని కొందరు బాయిల్డ్, రా రైస్ మిల్లర్ల నుంచి గత ఖరీఫ్, రబీ సీజన్ సీఎంఆర్ ఇంకా పెండింగ్ ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పెంచమని పేర్కొన్నారు. ఖరీఫ్ 2024-25 సీజన్ ధాన్యాన్ని తమ మిల్లుల్లో దించుకున్న యజమానులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని ఆదేశించారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.రజిత, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

పశువైద్యంపై పట్టింపేది?



తెరుచుకోని పోతుగల్ ఉపకేంద్రం

జిల్లాలో పశుసంపద ఇలా..

గేదెలు	1.12 లక్షలు
గొర్రెలు	3.10 లక్షలు
మేకలు	74 వేలు
కోళ్లు బాయిలర్	23 లక్షలు
కోళ్లు లేయర్	7 లక్షలు
దేశీ కోళ్లు	1.10 లక్షలు
కుక్కలు	11 వేలు

- జిల్లాలో ఖాళీగా పశువైద్యాధికారుల పోస్టులు
- 82 పోస్టులకు 41 మంది ఉద్యోగులు
- పత్తాలేని పారామెడికల్ సిబ్బంది

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో పశువైద్యంపై పట్టింపు లేకుండా పోయింది. వ్యాధులబారిన పడిన పశువులు విలవిల్లాడుతున్నాయి. సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నాయి. రైతులకు వ్యవసాయం తర్వాత పశుపోషణ ఉపాధిగా నిలుస్తుంది. అయితే పశువైద్యులు లేక అత్యవసర పరిస్థితుల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

అంతటా ఖాళీలు

వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, చందుర్తి, మానాలతోపాటు సిరిసిల్ల నియోజకవర్గంలో ముస్తాబాద్ పశువైద్యశాలల్లో అధికారులు లేరు. జిల్లాలో 13 పశువైద్యశాలలు ఉండగా జూనియర్ వెటర్నరీ అధికారుల పోస్టులు 7 ఖాళీగా ఉన్నాయి. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు 9 ఉండగా ఆరు ఖాళీలు ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు 11 ఉండగా 6 ఖాళీగా ఉన్నాయి. 255 గ్రామాలకు 20 మంది మాత్రమే గోపాలమిత్రలు ఉన్నారు. 32 ఆఫీస్ సబార్డినేట్స్‌కు 11 మంది మాత్రమే ఉన్నారు. జిల్లాలో 82 మంది అధికారులు, ఉద్యోగులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 41 మంది మాత్రమే పనిచేస్తున్నారు.

శిథిలావస్థలో పశు వైద్యకేంద్రాలు

జిల్లా కేంద్రంతో సహా మండలాల్లోని పశువైద్యశాలలు 90 శాతం వరకు శిథిలావస్థలో ఉన్నాయి. ఒకవైపు సిబ్బంది కొరతతో సతమతమవుతుండగా, ఇంకోవైపు వైద్యశాలలు సరిగ్గా లేవు. పశువైద్యశాలల్లోను కనీస వసతులు కరువయ్యాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవు. వీటికితోడు పశువులకు టీకాలు ఇచ్చే స్టాండ్స్ కరువయ్యాయి. గొర్రెలు, గేదెలకు నట్టలమందు, గాలికుంటు వ్యాధులకు మాత్రమే మందులు అందజేస్తున్నారు.



వీరు ముస్తాబాద్ మండల కేంద్రంలోని పశువైద్యశాల ఎదుట మృతిచెందిన ఆవు కళేబరంతో ఆందోళన చేస్తున్న రైతులు. ముస్తాబాద్‌కు చెందిన రైతు బొమ్మెల్ల ఎల్లారెడ్డి ఆవు ఈనె దశకొచ్చింది. ఈక్రమంలోనే రైతు ముస్తాబాద్ పశువైద్యశాలకు వెళ్లగా.. వైద్యాధికారి లేకపోవడంతో గోపాలమిత్రను సంప్రదించాడు. కడుపులో దూడ అడ్డం తిరిగినట్లు గుర్తించిన గోపాలమిత్ర ఆపరేషన్ చేయాలని సూచించాడు. ముస్తాబాద్‌లో ప్రస్తుతం పశువైద్యాధికారి లేకపోవడంతో ప్రత్యేక ఆటోలో కోరుట్ల పశువైద్య కళాశాలకు తరలించాడు. అక్కడ వైద్యులు లేకపోవడంతో ముస్తాబాద్‌కు తిరిగొచ్చాడు. ఇక్కడ ఆవు చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో రైతు ఎల్లారెడ్డి, రైతులు ముస్తాబాద్ పశువైద్యశాల ఎదుట ఆవు కళేబరంతో ధర్నాకు దిగారు. ఈ ఘటనతో జిల్లాలో పశువులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందని పరిస్థితి నెలకొందని అర్థమవుతోంది.

ఏడాదిగా ఆస్పత్రి తెరుచుకోలేదు



పోతుగల్‌లోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. దీంతో పనిచేసే సిబ్బంది ఎవరూ రావడం లేదు. ఏడాదిగా పశువైద్యశాల తెరుచుకోలేదు. కొత్త ఆస్పత్రి నిర్మించి, సేవలు పెంచాలి.

– తన్నీరు గౌతంరావు, మాజీ సర్పంచ్, పోతుగల్

ప్రతిపాదనలు చేశాం

జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతోపాటు పశువైద్యశాలలో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు చేశాం. ప్రభుత్వ విప్ ద్వారా పశువులకు స్టాండ్స్ నిర్మిస్తున్నాం. మందుల కొరత లేకుండా చూస్తాం.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి


శంకర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రైతు చిందు శంకర్(50) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శంకర్ తనకున్న ఎకరన్నర భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం సాగు పనులకు వెళ్లాడు. రాత్రి వచ్చి, భోజనం చేసి, పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత గుండెలో నొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పాడు. వారు ఆస్పత్రికి తరలించేలోపే చనిపోయాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు మెండె శ్రీనివాస్, మాజీ సర్పంచు బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండ రమేశ్ కోరారు.

జీవాలపై హైనా దాడి


మృతిచెందిన గేదెను చూపుతున్న రైతు

చిగురుమామిడి: మండలంలో హైనా దాడులతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల్లో రెండు పశువులపై దాడి చేసి, చంపింది. సోమవారం అర్ధరాత్రి సుందరగిరికి చెందిన గైని చంద్రమౌళి గేదె, ఆదివారం అర్ధరాత్రి గాగిరెడ్డిపల్లికి చెందిన చెన్నవేని మల్ల య్య లేగదూడను చంపేసింది. హైనా బారి నుంచి తమను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కోరుట్ల: బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్న ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన ఓ బాలికపై స్థానికుడైన ఇప్ప రవి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాధితురాలు తల్లిదండ్రులు విషయం చెప్పడంతో వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రవిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడి రిమాండ్

ముస్తాబాద్(సిరిసిల్ల): బాలికను వేధిస్తున్న ఓ యువకుడిని పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన గుండెల్లి అజయ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను కొన్ని నెలలుగా ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి, అజయ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎములాడలో గీతాజయంతి ఉత్సవాలు


హోమం చేస్తున్న అర్చకులు


గీతా పారాయణం చేస్తున్న విద్యార్థులు


ఎస్పీ గౌస్ ఆలంను సత్కరిస్తున్న అర్చకులు

వేములవాడ: ఎములాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు గీతా జయంతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనుబంధ దేవతామూర్తులకు ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తామని స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర శర్మ తెలిపారు. గీతాహోమం, గీతా ప్రవచనాలు, గీతాపారాయణం, దశమస్కంద పారాయణాలు, సాయంత్రం ప్రవచనాలు, గీతాభాష్య పారాయణాలు జరుపుతామన్నారు. ఈ నెల 12న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంస్కృత కళాశాల, వేద పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు నాగిరెడ్డి మండపంలో గీతా పారాయణం చేశారు. ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులున్నారు.

అభిషేకాలు.. అన్నపూజలు

వేములవాడ రాజన్నను మంగళవారం దాదాపు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ధర్మగుండంలో స్నానాలు చేసినవారు స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, అమ్మవారికి కుంకుమపూజ ద్వారా మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో ఆదిలాబాద్ ఎస్పీ

వేములవాడ రాజన్నను ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. అర్చకులు కల్యాణ మండపంలో స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందించి, వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఎస్సై అంజయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ప్రొటోకాల్ ఇన్‌చార్జి శివసాయి ఉన్నారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

- మరొకరికి ఐదేళ్ల జైలు

జగిత్యాల జోన్: భూ తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిని కిరాతకంగా హత్య చేసిన ఇద్దరు వ్యక్తులకు యావజ్జీవ శిక్షతోపాటు రూ.10 వేల చొప్పున జరిమానా, మరొకరికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి సుగాలి నారాయణ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్‌కు చెందిన చెదలు రాజేందర్–లత దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. గ్రామ శివారులోని కొండాపూర్ ఒర్రె వద్ద భూమి ఉంది. ఈ ఒర్రెకు అవతలి వైపు కాస సంజీవ్ భూమి ఉంది. అందులోకి వెళ్లే దారి విషయంలో సంజీవ్, రాజేందర్‌ల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతోపాటు పూర్వీకులకు సంబంధించిన మూడెకరాల భూమి పైనా వివాదాలున్నాయి. ఈ నేపథ్యంలో రాజేందర్ జనవరి 3, 2022న భార్య లత, కూలీలతో కలిసి తన తోటలో వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఒర్రె పక్కనున్న వ్యవసాయ బావికి కరెంట్ మోటార్ బిగించేందుకు వెళ్లాడు. కాసేపటికే అరుపులు వినిపించడంతో లత, కూలీలు అక్కడికి పరుగెత్తారు. వారిని చూసి, సంజీవ్, మరికొందరు కత్తులతో పారిపోయారు. రాజేందర్ రక్తపు మడుగులో చనిపోయి కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఉమాసాగర్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శ్రీనివాస్ దర్యాప్తు ప్రారంభించి, కాస సంజీవ్‌తోపాటు తైదపల్లి రజనీకాంత్, మంగళారపు లక్ష్మీనారాయణలను అరెస్టు చేశారు. కోర్టులో చార్జిషీట్ వేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు రంజిత్, కిరణ్‌కుమార్ న్యాయస్థానంలో సాక్షులను ప్రవేశపెట్టారు. జడ్జి సాక్ష్యాధారాలు పరిశీలించి, సంజీవ్, రజనీకాంత్‌లకు యావజ్జీవం, లక్ష్మీనారాయణకు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

కూతురిని కడతేర్చిన తండ్రికి జీవిత ఖైదు

కరీంనగర్ క్రైం: దివ్యాంగురాలైన కూతురిని హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదుతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ మండలంలోని తీగలగుట్టపల్లికి చెందిన కొమిరె మహేందర్ భార్య చనిపోవడంతో చంద్రపురి కాలనీకి చెందిన భావనను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు పాప జన్మించింది. 6 నెలలకు ఆ చిన్నారికి తీవ్ర జ్వరం రావడంతో నరాలు దెబ్బతిని, కాళ్లుచేతులు పడిపోయాయి. ఆరేళ్ల వయసు వచ్చినా ఆ పాప కోలుకోలేదు. ఈ క్రమంలో మహేందర్ ఏ పనీ చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. భార్యాబిడ్డను తరచూ వేధిస్తుండేవాడు. దీంతో భావన 2023 ఫిబ్రవరి చివరి వారంలో బిడ్డను వదిలేసి, పుట్టింటికి వెళ్లిపోయింది. కూతురిని చంపేందుకు ఇదే అదునుగా భావించిన మహేందర్ అదే ఏడాది మార్చి1న రాత్రి ఆమెను హత్య చేసి, కెనాల్‌లో పడేశాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు మహేందర్‌పై కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ విజ్ఞాన్ రావు దర్యాప్తు చేపట్టారు. సీఎంఎస్ఏ ఎస్సై తిరుపతి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు విచారించారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించి, మహేందర్‌కు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు.

అక్రమ రిజిస్ట్రేషన్.. తండ్రీకూతురి అరెస్టు

- పరారీలో అల్లుడు

చందుర్తి(వేములవాడ): ఇంటిని అక్రమంగా గిఫ్ట్ డీడ్ చేసుకున్న కేసులో తండ్రీకూతురిని అరెస్టు చేశామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని నర్సింగపూర్‌కు చెందిన జాగిరి దేవలింగం అలియాస్ దేవయ్యకు నలుగురు కుమారులున్నారు. వీరిలో నర్సయ్య తన ముగ్గురు సోదరులకు రూ.80 వేలు చెల్లించి, ఉమ్మడి ఇంటిని తీసుకున్నాడు. అయితే, ఈ అన్నదమ్ముల్లో ఒకరైన పర్శరాములు ఇదే ఇంటిని తన కూతురు మానస పేరిట గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించాడు. అతని అల్లుడు నేరెల్ల రమేశ్ డాక్యుమెంట్ రైటర్ కావడంతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పర్శరాములు, మానస, రమేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తండ్రీకూతురిని మంగళవారం అరెస్టు చేయగా, అల్లుడు రమేశ్ పరారైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం

చిగురుమామిడి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లికి చెందిన దరిపెల్లి రవి(31) మంగళవారం సుందరగిరి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో టాటాఏస్ వాహనం సుందరగిరి వైపు నుంచి వస్తోంది. బొమ్మనపల్లి ఊరిలోనే బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి కుడికాలు పూర్తిగా విరిగిపోగా, తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా.. మద్యంతాగి బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి పోలీసులను చూసి వెనుకకు అతి వేగంగా వెళ్తూ మరో బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. చరణ్‌ను కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

న్యాయవాదికి...

సిరిసిల్ల క్రైమ్ : పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ధర్మేందర్ కారులో కరీంనగర్ వెళ్తుండగా చింతకుంట వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నుజునుజ్జుకాగా ధర్మేందర్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు


సిరిసిల్లకల్చరల్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో అర్హత, నైపుణ్యం గల వారికి విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ తెలిపారు. దుబాయ్ లాంటి దేశాల్లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు ఎస్సెస్సీ విద్యార్హత, రెండేళ్ల అనుభవం చాటే డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు 40 ఏళ్ల లోపు వయసు గలవారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్ అర్హతతో సెక్యూరిటీ గార్డు పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94400 50951 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గడియారానికి బదులు రాళ్లు


రాళ్లు, పిల్లలు ఆడుకునే వాచ్‌ను చూపుతున్న రాజు

యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం): రూ.2 వేల విలువైన వాచ్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసిన వ్యక్తికి రాళ్లు, చిన్న పిల్లలు ఆడుకునే వాచ్ వచ్చాయి. బాధితుడి వివరాల ప్రకారం.. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీకి చెందిన రాజు నాలుగు రోజుల క్రితం రూ.2 వేల విలువైన వాచ్‌ను బుక్ చేశాడు. మంగళవారం డెలవరీ బాయ్‌కి డబ్బులు చెల్లించి, బాక్స్‌ను తీసుకున్నాడు. ఓపెన్ చేసి, చూడగా.. అందులో ఎక్వేరియంలో ఉపయోగించే రంగు రాళ్లు, చిన్న పిల్లలు ఆడుకునే వాచ్ ఉన్నాయి. ఈ విషయమై డెలివరీ బాయ్‌ని ప్రశ్నించగా తనకు తెలియదన్నాడు. ఫోన్‌లోనే ఆర్డర్ రిటర్న్ పెట్టాలని చెప్పాడు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు


అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం: అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన ఉప్పుగుండ్ల మురళీకృష్ణ తల్లి రాజమణి కరీంనగర్ కట్టరాంపూర్‌లోని శాతవాహన కాలనీలో నివాసం ఉంటోంది. గత నెల 23న ఇంటికి తాళం వేసి, ఊరెళ్లింది. రెండు రోజుల తర్వాత తిరిగిరాగా, తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా టీవీ ధ్వంసమైంది. బీరువాలోని 20 గ్రాముల బంగారు, 46 గ్రాముల వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుంది. కరీంనగర్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కోటేశ్వర్ కేసు నమోదు చేసి, తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక గౌతమి నగర్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. సత్తిబాబును కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. అతనిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కలిపి 20కి పైగా కేసులున్నట్లు, గతంలో జైలుశిక్ష సైతం అనుభవించినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

శంకరపట్నం(మానకొండూర్): తాళం వేసిన ఇంట్లో చొరబడిన దుండగులు బంగారు గొలుసు, నగదు చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని అర్కండ్లకు చెందిన నేదురు ఐలమ్మ సోమవారం ఇంటికి తాళం వేసి, పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లిచూడగా.. రూ.74 వేలు, 2 తులాల బంగారు గొలుసు కనిపించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే గ్రామానికి చెందిన ఓ కుటుంబంపై అనుమానం ఉందని చెప్పింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

వెంకటాపూర్ గ్రామంలో..

కోరుట్ల రూరల్: తాళం వేసిన రెండిళ్లలో దుండగులు చొరబడి, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల రూరల్ మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన కొత్తపెల్లి రాజేశ్వరి, పల్లా లక్ష్మీరాజం సోమవారం తమ ఇళ్లకు తాళాలు వేసి, కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లారు. మంగళవారం ఉదయం పక్కింటివాళ్లు చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే బాధితులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి, చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. మూడున్నర తులాల బంగారు ఆభరణాలు పోయాయని రాజేశ్వరి, రెండు తులాల బంగారు ఆభరణాలు పోయాయని లక్ష్మీరాజం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇసుక లారీల అడ్డగింత

మానకొండూర్ రూరల్: మండలంలోని ఊటూరులో ఇసుక లారీలను స్థానికులు మంగళవారం కూడా అడ్డగించారు. గ్రామ శివారులోని మానేరు వాగు ఇసుక క్వారీ నుంచి ఇసుకను తరలిస్తుండగా సోమవారం సాయంత్రం అడ్డుకున్నారు. ఇసుకను అధిక మొత్తంలో తీసుకెళ్తున్నారని ఆరోపించారు. లారీలు వెళ్తుండటంతో రోడ్డు పాడవుతోందని, దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఇసుకను నిర్ణీత సమయంలో కాకుండా రాత్రింబవళ్లు తరలిస్తున్నారని మండిపడ్డారు.

వ్యభిచార నిర్వాహకులపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణ శివారులోని బైపాస్‌రోడ్‌లో ఓ వ్యభిచార గృహంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలతోపాటు, ఇద్దరు విటులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

రాజన్న కోడెలు అమ్ముకున్న ముగ్గురి అరెస్టు

- రాంబాబుతోపాటు మరో ఇద్దరి రిమాండ్
- రైతుల పేరిట సంతకాలు పెట్టి కోడెలను తీసుకువెళ్లారు..
- వివరాలు వెల్లడించిన గీసుకొండ సీఐ మహేందర్

గీసుకొండ(నర్సంపేట): వేములవాడ రాజన్న కోడెలను అమ్ముకున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గీసుకొండ సీఐ మహేందర్ కథనం ప్రకారం.. శ్రీరాజరాజేశ్వర సొసైటీ పేరిట గోశాల నడుపుతున్న వెలగందుల రాజు, కాంగ్రెస్ నాయకుడు మాదాసి రాంబాబు ఈ నెల 1న వేములవాడ దేవస్థానం నుంచి లేగదూడలు తీసుకొని వచ్చి, కబేళాలకు తరలిస్తున్నారు. వారిపై విశ్వహిందూ పరిషత్‌తోపాటు పలువురు గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాంబాబును అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అతడితోపాటు అనంతారం గ్రామానికి చెందిన మంద స్వామి, దుగ్గొండి మండలం చలపర్తి (ప్రస్తుతం అనంతారం నివాసి)కి చెందిన పశునూని శ్యాంసుందర్ కలిసి వారి కుటుంబ సభ్యులతోపాటు గీసుకొండ, దుగ్గొండి మండలంలో తెలిసిన రైతుల నుంచి ఆధార్‌కార్డులు, భూమి పత్రాలను సేకరించారు. అనంతరం వేములవాడ గోశాలకు వెళ్లి అక్కడి దేవాలయ అధికారుల సహకారంతో రైతుల సంతకాలు పెట్టారు. రెండు విడతలుగా 66 కోడెలను గీసుకొండ మండలం గట్టుకిందిపల్లిలోని మాదాసి రాంబాబు కౌలుకు తీసుకొని, వ్యవసాయం చేస్తున్న భూమి పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించారు. వాటిలో 28 కోడెలను అమ్ముకోగా మరో 26 కోడెలను వేములవాడ గోశాలకు తిరిగి అప్పగించారు. అలాగే, మూడు కోడెలు చనిపోగా, మిగిలిన మరో 9 కోడెలను స్వాధీనం చేసుకున్నామని, దీనికి బాధ్యులైన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుల ఫొటోలు కావాలని పోలీసులను విలేకరులు కోరగా.. ఆయన స్పందించలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకే మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు


క్రీడాకారులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి

- బాలుర విభాగంలో కరీంనగర్..
- బాలికల విభాగంలో ఖమ్మం ప్రథమ స్థానం

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–14 నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. బాలుర విభాగంలో కరీంనగర్ ప్రథమ స్థానంలో, మహబూబ్‌నగర్ ద్వితీయ, ఖమ్మం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ఖమ్మం ప్రథమ, కరీంనగర్ ద్వితీయ, హైదరాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో జనార్దన్‌రావు హాజరై, మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతాయన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు.అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు అనేక క్రీడా పోటీలు నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలిపిస్తే గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తా..

నిరుద్యోగ యువతకు బాసటగా నిలిచేందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీలో ఉంటున్నానని, గెలిపిస్తే గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను 600 మంది నిరుద్యోగ యువతకు ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను అనేక గ్రంథాలయాలకు వెళ్లానని, చాలాచోట్ల మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. సొంత ఖర్చులతో నిరుద్యోగులకు భోజన ఏర్పాటు చేయడంతోపాటు చైర్ ప్యాడ్స్, వాటర్ కూలర్స్, సింటెక్ ట్యాంకులు, కొన్నిచోట్ల అదనపు తరగతి గదులకు రేకులు వేయించానని పేర్కొన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బుర్ర మధుసూదన్ రెడ్డి, చందు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

‘రాజ్యాంగాన్ని రక్షిస్తేనే హక్కులకు రక్షణ’



మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్

జగిత్యాలరూరల్: రాజ్యాంగాన్ని రక్షిస్తేనే హక్కులకు రక్షణ ఉంటుందని కేంద్ర సమాచార మాజీ కమిషనర్, విద్యావేత్త మాడభూషి శ్రీధర్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కులు అడిగితే వస్తాయి తప్ప మౌనంగా ఉంటే రావని తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు లత గంగారాం, జాతీయ అధ్యక్షుడు అయిల్నేని శ్రీధర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరమల్ల సందీప్, కార్యదర్శి నాగరాజు, నాయకుడు చుక్క గంగారెడ్డి, జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, న్యాయవాది భాస్కర్‌రెడ్డి, సంస్థ సెర్ప్ ఏవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.


దేవాదాయ శాఖ అధికారుల అడ్డగింత

- ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని శాఖ పరిధిలోకి తీసుకోవడంపై అభ్యంతరం
- వీడీసీ ఆధ్వర్యంలోనే కొనసాగాలన్న సభ్యులు


అధికారులను అడ్డుకుంటున్న వీడీసీ సభ్యులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకోవద్దని వీడీసీ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంబంధిత అధికారులు మంగళవారం ఆలయానికి రావడంతో వారితో వాగ్వాదానికి దిగారు. ఆలయ నిర్వహణ వీడీసీ ఆధ్వర్యంలోనే కొనసాగాలన్నారు. ఇందుకు వారు అంగీకరించలేదు. పోలీసుల బందోబస్తు మధ్య ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ సమయంలో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది వీడీసీ సభ్యులను, గ్రామస్తులను సముదాయించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ సుప్రియ స్థానిక వ్యాపారులతో మాట్లాడారు. తైబజార్ రుసుము, మేక, కోడి కోతకు ఎంత వసూలు చేస్తున్నారు.. తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నేటి నుంచి ఆలయ ఈవోగా కాంతారెడ్డి బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. ప్రతీ మంగళవారం ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారన్నారు. వారు అమ్మవారికి సమర్పించే కానుకలు, డబ్బులు పక్కదారి పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, విచారణలో నిజమేనని తేలిందన్నారు. ఈ కారణంగానే ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వీడీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావును కలిశారు. ఆలయ నిర్వహణ వీడీసీ ఆధ్వర్యంలోనే సాగేలా చూడాలని విన్నవించారు.

మేనేజ్‌మెంట్ విద్యాసంస్థతో ఒప్పందం


ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్‌సిటీ: కళాశాల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు, కళాశాల అధ్యాపకులకు రీసెర్చ్ వర్క్‌షాప్, శిక్షణ కల్పించాలనే ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ విద్యాసంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలోని ఐపీఈ క్యాంపస్ ఆవరణలో కళాశాల అధ్యాపకులు, ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెల్ కన్వీనర్ బూర్ల నరేశ్, కె.అర్జున్, ఐపీఈ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ మూర్తి, వై.రామకృష్ణ బృందం సమక్షంలో ఎస్సారార్ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాలు, ఉపాధిని కల్పించాలనే ఉద్దేశంతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు శ్రీకాంత్, లక్ష్మీకుమారి, వై.రామకృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.